రథోత్సవంలో భక్తజన సందోహం



చల్లగచూడు సామీ..



భక్తులకు దర్శనమిస్తున్న బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి





దప్పుల మోత.. | జై జగన్నాథ.. | దేవుడా..

అడుగడుగో.. జగన్నాథుడు..

బలభద్ర, సుభద్ర సమేతుడై వచ్చాడు

అనంత వీధులలో స్వామివారి రథయాత్ర



జగన్నాథ రథానికి గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న భక్తులు

జగన్నాథ రథయాత్ర నగరవాసులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఇస్కాన్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో శనివారం బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడిని రథంపై కొలువుదీర్చి నగర వీధులలో ఊరేగించారు. రథయాత్ర సాగే దారులను మహిళలు, యువతులు రంగవల్లికలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు రథం ముందు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. భక్తులు హరినామస్మరణ చేస్తూ, నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. రథోత్సవం ప్రారంభానికి ముందు కేఎస్ఆర్ కళాశాల వద్ద ఇస్కాన్ జాతీయ ప్రతినిధులు సత్యగోపీనాథ్‌దాస్, రాధామనోహర్‌దాస్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భగవంతునికి, భక్తునికి మధ్య బంధానికి ప్రతీకలు ఇలాంటి రథయాత్రలు అని అన్నారు. మన దేశంతోపాటు పాశ్చాత్య దేశాల్లోని నాలుగు వేల ప్రాంతాల్లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. జగన్నాథుడి రథయాత్రతో నగరం మరింత పవిత్రతను సంతరించుకుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. దైవ దర్శనానికి ఆలయాలకు వెళ్లడం పరిపాటి అని, కానీ జగన్నాథుడే భక్తుల చెంతకు వచ్చి అనుగ్రహించడం జిల్లా ప్రజలు చేసుకున్న పుణ్యమని మాజీ మంత్రి శైలజానాథ్ అన్నారు. పూణె నుంచి వచ్చిన కళాకారుల బృందానికి మాసినేని రామయ్య రూ.3.5 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ముఖ్య అతిథులు బంగారు వర్ణపు చీపుర్లతో రోడ్లను ఊడ్చగా.. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివార్లకు పూజలు నిర్వహించి.. రథయాత్రను ప్రారంభించారు. కేఎస్ఆర్ కళాశాల వద్ద ప్రారంభమైన జగన్నాథ రథయాత్ర.. సప్తగిరి సర్కిల్, క్లాక్ టవర్, రాజురోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్డు, గాంధీబజార్, పాతూరు, బసవన్నకట్ట, సప్తగిరి సర్కిల్ మీదుగా లలితకళాపరిషత్ వరకూ సాగింది. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మేయర్ మదమంచి స్వరూప, ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్, శ్రీపాద వేణు, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రంగారెడ్డి తదితరులు రథయాత్రలో పాల్గొన్నారు.

- అనంతపురం కల్చరల్



కళాకారుల ప్రదర్శనలు













పైరు పచ్చని కలలు..!

హెచ్చెల్సీ ఆయకట్టులో సందడి.. వరి సాగుకు అన్నదాత సన్నద్ధం



బొమ్మనహాళ్, జూలై 13: హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు ఖరీఫ్ సాగు వేగం పెంచారు. వరి నారును సిద్ధం చేసుకున్నారు. తుంగభద్ర జలాల కోసం ఎదురుచూస్తున్నారు. టీబీ డ్యాంలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. కర్ణాటకలో వర్షపాతం ఆధారంగా.. ఇన్ ఫ్లోలో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. డ్యాంలో శనివారం సాయంత్రానికి 30 టీఎంసీలకు పైగా నిల్వలున్నాయి. ఈ ఏడాది సాగునీరు ముందస్తుగానే వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు, తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని.. నీటిని విడుదల చేసే యోచనలో అధికార యంత్రాంగం ఉంది.

రైతుల్లో ఉత్సాహం

ఆయకట్టు రైతుల్లో కొందరు ఇప్పటికే బోరుబావుల కింద వరి సాగు పనులను ప్రారంభించారు. నారు సిద్ధమైనందున.. నాట్లు వేసుకుంటే.. ఆ తరువాత కాలవ నీరు వస్తుందన్న ఆలోచనతో ముందడుగు వేస్తున్నారు. గత ఏడాది అనుభవం రైతుల్లో గుబులు పుట్టిస్తోంది. గత ఖరీఫ్‌లో ఆయకట్టు కింద పంటలను కాపాడేందుకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిని అమలు చేశారు. పైగా డ్యాం నుంచి రావాల్సిన రెండు టీఎంసీల నీటి వాటాను తీసుకోవడంలో వైసీపీ పాలకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో రైతులు నష్టపోయారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం తుంగభద్ర జలాశయం నుంచి నీటి వాటాను సక్రమంగా తీసుకుంటుందని రైతులు విశ్వసిస్తున్నారు. అదే ధీమాతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలో 20 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో హెచ్చెల్సీ ఆయకట్టు కింద వరి, మిరప, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తారు. ప్రతి సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. కానీ వైసీపీ పాలనలో కాలువలు సక్రమంగా లేక.. సాగునీరు సరిగా అందలేదు. రైతులు పంటలు వేసేందుకు ఆసక్తి చూపేవారు కాదు. టీడీపీ కూటమి అధికారం చేపట్టిన కొద్ది సమయంలోనే హెచ్చెల్సీ అత్యవసర మరమ్మతు పనులను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పూర్తి చేయించారు. దీంతో సాగునీరు సక్రమంగా అందుతుందని రైతులు ధైర్యంగా సాగు పనుల్లోకి దిగారు.

35 ఎకరాలకు..



హెచ్చెల్సీ ఆయకట్టు కింద సొంత పొలం 13 ఎకరాలు, కౌలు భూమి 22 ఎకరాలలో పంట సాగుకు సిద్ధమవుతున్నాను. ఈ ఏడాది మొత్తం 35 ఎకరాలలో వరిపంట సాగు చేస్తున్నాను. వరి విత్తనం కోసం 25 కేజీల ప్యాకెట్లు 25 కొనుగోలు చేసి.. 30 సెంట్ల విస్తీర్ణంలో నారు పోశాను. నెల్లూరు నుంచి వరి విత్తనం తెప్పించాను. ఒక్కో ప్యాకెట్‌ను రూ.1600 ప్రకారం కొన్నాను. నారు పోసేందుకు 30 సెంట్ల భూమిని రూ.15 వేలకు లీజుకు తీసుకున్నాను.

- ఈశ్వర, శ్రీధరఘట్ట

అప్పు తీరుతుందని..



వేసవిలో బోరు బావుల కింద 15 ఎకరాలలో పత్తి పంటను సాగుచేశాను. దిగుబడి రాక పంటను కోల్పోయాను. మూడు లక్షల రూపాయలకుపైగా నష్టపోయాను. ఈ ఖరీఫ్‌లో వరి దిగుబడి బాగా వస్తే.. పత్తి పంట అప్పును తీరుతుంది. ఆ నమ్మకంతో 18 ఎకరాల్లో వరిపంట సాగు చేస్తున్నాను. ఇప్పటికే వరినారు కోసం రూ.25 వేలు ఖర్చు చేశాను. తుంగభద్ర డ్యాం నుండి నీరు సకాలంలో వస్తే వరి పంట దిగుబడి బాగా వస్తుంది. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అధికారులు చొరవ చూపాలి.

- ఆంజనేయులు, గౌనూరు

ఆదెప్ప హంతకుల్ని వదిలిపెట్టం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్, జూలై 13: మెచ్చిరి గ్రామంలో టీడీపీ నాయకుడు ఆదెప్ప రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక వైసీపీ గూండాలు అతి కిరాతకంగా హత్య చేశారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. హత్యకు సహకరించిన వారెవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. మెచ్చిరి గ్రామానికి వెళ్లి ఆదెప్ప కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. వారికి రూ.50 వేలు సాయం అందించారు. పార్టీ తరఫున మరో రూ.2 లక్షలు ఇస్తామని తెలిపారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆదెప్ప హత్యకు సూత్రధారి అయిన కేశవరెడ్డి పాత్ర నామమాత్రమేనని, హత్యకు సహకరించిన గ్రామ సర్పంచ్ తనయుడు చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో 15 మందికి కూడా శిక్ష పడేలా చూస్తామని అన్నారు. ఆదెప్ప గ్రామంలో పెద్ద మనిషిలా వ్యవహరిస్తుండేవాడని, ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం బీసీ, ఎస్సీ నాయకులను కలుపుకుని పనిచేశారని అన్నారు. కేవలం రాజకీయంగా ఎదుగుతున్నాడనే కక్షతోనే మూడురోజులు రెక్కీ నిర్వహించి దారుణంగా హత్య చేశారని అన్నారు. ఈ హత్య గురించి సీఎం చంద్రబాబుతో చర్చించామని తెలిపారు. హత్య చేసినవారు గ్రామంలో తిరుగుతున్నారని, పోలీసుల మెతక వైఖరే దీనికి కారణమని బాధిత కుటుంబం అంటోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచులు వన్నూరుస్వామి, రాజశేఖర్‌రెడ్డి, లచ్చన్నచౌదరి, సోమశేఖర్, గిరిధర్‌నాయుడు, వీరేష్, డాక్టర్ రామస్వామి, హనుమంతు, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, ఆంజనేయులు, తిమ్మారెడ్డి, సిద్ధప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఆదెప్ప కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ఎస్పీగా కేవీ మురళీకృష్ణ

గౌతమిశాలి బదిలీ



జిల్లా కొత్త ఎస్పీ మురళీకృష్ణ

అనంతపురం క్రైం, జూలై 13: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్పీల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా జిల్లాకు కేవీ మురళీకృష్ణను నియమించారు. అనకాపల్లి ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న మురళీకృష్ణను ఇక్కడకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ గౌతమిశాలిని విజయవాడలోని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ.. బదిలీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 37 మంది ఐపీఎస్ అధికారులను శనివారం బదిలీ చేసింది.

ఎన్నాళ్లయినా ఇంతేనా?

- సంక్షేమ వసతి గృహాల్లో సమస్యల తిష్ట
- అగచాట్లు పడుతున్న విద్యార్థులు
- కలగానే ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం





బీకేఎస్‌లో ఎస్సీ బాలుర వసతి గృహంలో స్నానపు గదులు లేక ఆరుబయటే డ్రైనేజీ కాలువ పక్కనే స్నానాలు చేస్తున్న విద్యార్థులు

సంక్షేమ వసతి గృహాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా వాటి పరిస్థితి మెరుగుపడటం లేదు. నియోజకవర్గంలో ఏ వసతి గృహానికి వెళ్లి చూసినా ఏదో ఒక సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చెప్పుకునే సమస్యలు కొన్ని అయితే.. చెప్పుకోని సమస్యలు మరెన్నో ఉన్నాయి. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక హాస్టల్ విద్యార్థులు నానా అగచాట్లు పడ్డారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభం అయి దాదాపు నెల రోజులు గడుస్తున్నా వసతి గృహ విద్యార్థులకు ఇంకా కొత్త దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు రాలేదు. దీంతో ఇంటి వద్ద నుంచే విద్యార్థులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- బుక్కరాయసముద్రం





ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్.. నిరుపయోగకరంగా ఉన్న మరుగుదొడ్లు

అన్నీ బయటే..

మరుగుదొడ్లు, స్నానాల గదులు లేకపోవడంతో విద్యార్థులు అన్నింటికీ ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. ఉదారణకు బీకేఎస్ ఎస్సీ బాలుర వసతి గృహంలో 200 మందికి పైగా ఉన్నారు. 15 సంవత్సరాల కిందట నిర్మించిన ఈ వసతి గృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు శిథిలావస్థకు చేరు కున్నాయి. సరిపడే బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు లేకపోవడంతో స్నానాలు , కాలకృత్యాలు అన్ని ఆరుబయట తీర్చుకోవాల్సిందే. రాత్రి సమయాల్లో వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. పురుగు, పుట్ర బారిన పడితే ఎవరిది బాధ్యత అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో గదుల సంఖ్య తక్కువగా ఉంది. ఒక గదిలోనే 25 నుంచి 30 మంది వరకు ఉండాల్సిన పరిస్థితి. ఈ ఒక్క హాస్టలే కాదు నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ బాలుర, బాలిక వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన లేకపోవడంతో విద్యార్థుల అవస్థలు పడుతున్నారు.



ఇరుకు గదిలో..

అందని మెస్, కాస్మెటిక్ చార్జీలు

సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీల బకాయిలు పేరుకు పోయాయి. గడిచిన 10 నెలలుగా నిధులు విడుదల కావడం లేదు. వసతి గృహాల నిర్వహణకు సంబంధించి నిధులను గత ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతి నెలా బయటి నుంచి అప్పు తెచ్చి విద్యార్థులకు మోను అందించాలంటే తలకు మించిన భారం అవుతోందని వార్డెన్లు వాపోతున్నారు. నూతన ప్రభుత్వమైనా బిల్లులు విడుదల చేస్తే విద్యార్థులకు సక్రమంగా మోను అమలు చేస్తామని వారు పేర్కొంటున్నారు.

నిర్మాణం ఎప్పుడో..!

నూతన భవన నిర్మాణం కోసం బుక్కరాయసముద్రంలోని ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఎదురు చూస్తోంది. గతంలో ఎస్సీ సంక్షేమ వసతి గృహం ఉన్న భవనాన్నే రెసిడెన్షియల్ పాఠశాలగా మార్చారు. అప్పట్లో 120 మంది విద్యార్థులకు సరిపడేలా భవనం ఉండేది. అయితే ప్రస్తుతం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 320 మంది విద్యార్థులు ఉండాలి. కానీ తక్కువ గదుల ఉండటంతో 200 మందికే సీట్లు కేటాయిస్తున్నారు. ఈ రెండు వందల మంది విద్యార్థులకు 8 గదుల మాత్రమే ఉన్నాయి. పైన విద్యార్థుల ఉండటానికి, నిద్రపోవటానికి చాలా ఇరుకైన గదులు 8 ఉన్నాయి. ప్రతి గదిలో 25 నుంచి 30 మంది వరకు ఉండాల్సిన పరిస్థితి . నాడు -నేడు కింద పాఠశాలపైన ఈ 8 వసతి గృహాలు నిర్మించారు. భవనంపైన స్లాబ్ వేయకుండా రేకుల షెడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో విద్యార్థులు వేడి, ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. నూతన భవనం కోసం బుక్కరాయసముద్రంలో సర్వేనెంబరు396 సర్వే నెంబరులో 5 ఎకరాల స్థలంను 2018లో కేటాయించారు. అయితే ఇందుకు సంబంధిం చి నిధులు లేక పోవడంతో ట్రైబల్ గురుకుల పాఠశాల నిర్మాణం పూర్తిగా ఆగిపోయింది.

ప్రతిపాదనలు పంపాం



పస్తుతం ఈ రెసిడెన్సియల్ పాఠశాల చిన్నది కావడంతో విద్యార్థులకు సరిపోవడం లేదు. నూతన భవనం కోసం బీకేఎస్‌లో 5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందు కోసం నిధులు కేటాయించలేదు. నూతన భవనం కోసం జిల్లా అధికారులకు నివేదిక పంపాం. నిధులు మంజూరు అయ్యి , నూతన భవనం నిర్మిస్తే 3 వతరగతి నుంచి 10 వరకు గిరిజన విద్యార్థులు 350 మంది ఉండి చదువుకోవడానికి అవకాశం ఉంటుంది.

-హరినాయక్, ప్రిన్సిపాల్

కరువు సీమలో ప్రాజెక్టులు పూర్తి చేయడమే టీడీపీ లక్ష్యం

ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అనంతపురం కల్చరల్, జూలై 13: కరువు సీమలో ప్రాజెక్టులు పూర్తి చేయడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. రాయలసీమ ప్రజాసంఘాలు, సాహిత్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని సింగమనేని సభాప్రాంగణంలో శనివారం నిర్వహించిన కథ కార్యశాలకు ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత దివంగత రచయితలు సింగమనేని నారాయణ, చిలుకూరి దేవపుత్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పూర్తి నిర్లక్ష్యానికి గురైందన్నారు. పరిశ్రమలు స్థాపించడం, పెట్టుబడులు రాబట్టడం, ఉపాధి అవకాశాలు ఇలా అన్ని రంగాల్లోనూ జిల్లా వెనుకబడిపోయిందన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమకు నీరందించడంలో టీడీపీ కృషి చేసిందన్నారు. గత పదేళ్లనుంచి హంద్రీనీవా రావడం వల్ల కొంత ప్రయోజనం కలిగిందన్నారు. ప్రస్తుతం హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా కాలువ వెడల్పు వంటి పనులు చేయాల్సివుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, జూటూరు షరీఫ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సరిపూటి రమణ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, బీసీ సెల్ నాయకుడు జోగి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాయి బోధనలే శిరోధార్యం

యువ సదస్సులో వక్తలు.. అలరించిన సంగీతకచేరి

నేడు సత్యసాయి క్రికెట్ లీగ్‌పోటీలు



సంగీత కచేరి నిర్వహిస్తున్న బౌడెల్‌బృందం

పుట్టపర్తి, జూలై 13 : సత్యసాయిబాబా ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలే తమకు శిరోధార్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. రెండోరోజు శనివారం ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో సత్యసాయి గ్లోబల్ యంగ్ అడాల్ట్ సదస్సు కొనసాగింది. దేశవిదేశాలకు చెందిన వక్తలు ప్రసంగించారు. ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలు, మానవాళికి అందిస్తున్న వెలకట్టలేని సేవలతో బాబా ఆధ్యాత్మిక గురువుగా పూజలు అందుకుంటున్నారన్నారు. ప్రశాంతినిలయం వేదికగా ప్రపంచానికి శాంతిసందేశాన్ని అందించారని వివరించారు. సత్యసాయి బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు ముందుకెళుతున్నామని అన్నారు. మానవసేవయే మాధవసేవ అన్న సత్యంతో సామాజిక సేవలు అందిస్తున్నామని వివరించారు. ఉన్నత విద్య, విలువలు, కలిగి ఉండి సామాజిక సేవాస్పృహతో జీవనం సాగించాలని సూచించారు. సాయంత్రం సాయి కుల్వంత్ సభామండపంలో బౌడెల్‌బృందం సంగీతగాన కచేరి నిర్వహించారు. గంటపాటు మధురగానంతో భక్తులను అలరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఆదివారం యువసదస్సు కొనసాగనుంది.

నేడు సత్యసాయి యూనిట్ కప్

సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం హిల్‌వ్యూస్టేడియంలో భారత్ లెవన్, గ్లోబల్‌లెవన్ జట్లమధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. మాజీ క్రికెటర్ మురళీకార్తీక్, ట్రస్టుసభ్యులు కలసి క్రికెట్‌లీగ్ పోటీలను ప్రారంభిస్తారు.

తపాలా కార్యాలయంలో గోల్‌మాల్

లబోదిబోమంటున్న ఖాతాదారులు



విచారిస్తున్న అధికారులు

నల్లమాడ, జూలై 13: తపాల కార్యాలయంలో దాచుకున్న డబ్బులు గోల్‌మాల్ కావడంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. ఏకంగా రూ. 20 లక్షల వరకు అవినీతి జరిగినట్లు ఖాతాదారులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో పలువురు డిపాజిట్లు, ఆర్డీలు చేసుకున్నారు. ఇందులో కాలపరిమితి అయిన వారు డబ్బుల కోసం తపాలా కార్యాలయ అధికారి వద్దకు వెళ్లారు. ఆయన వారితో సంతకాలు చేయించుకొని కొద్ది రోజుల తర్వాత డబ్బులు మీకు అందజేస్తామని చెప్పినట్లు ఖాతాదారులు తెలిపారు. ఇలా పలుమార్లు తిప్పుకున్నాడనిగానీ డబ్బులు అందజేయలేదన్నారు. దీంతో తపాలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, వారు నల్లమాడ కేంద్రానికి చేరుకుని తనిఖీ చేశారు. అయితే తనిఖీ వివరాలు వెల్లడించకుండ గోప్యంగా ఉంచుతున్నారు. దీంతో ఖాతాదారులు ఆందోళన చెంది నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం ఉన్నతాధికారులు శనివారం మండలకేంద్రానికి వచ్చి విచారణ చేశారు. ఎంత అవినీతి జరిగిందనేది ఇంత వరకు బయటకు రాలేదు. దాదాపుగా రూ.20 లక్షలు వరకు అవినీతి జరిగినట్లు ఖాతాదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల విచారణలో వాస్తవాలను ఎప్పుడు బయటకు చెబుతారనేది వేచిచూడాల్సి ఉంది.

రెండేళ్లలో రైల్వేలైన్ పూర్తి చేస్తాం

రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ పనుల పరిశీలన

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

నీటి సమస్యలపై డీపీఆర్ తయారు చేయండి

రైల్వే, జలవనరుల సహాయ మంత్రి మంత్రి సోమణ్ణ

మడకశిర, జూలై 13: రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ నిర్మాణ పనులు 2026 డిసెంబరులోపు పూర్తి చేయడమే లక్ష్యమని రైల్వే, జలవనరుల సహాయ మంత్రి సోమణ్ణ పేర్కొన్నారు. మడకశిర సమీపంలో జరుగుతున్న రైల్వేలైన్ నిర్మాణ పనులను శనివారం ఆయన ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రాయదుర్గం-తుమకూరు, మడకశిర మీదుగా జరుగుతున్న రైల్వే పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. రైల్వేలైన్ నిర్మాణ పనుల వల్ల ఇళ్లు కోల్పోతున్న బాధితులకు అండగా ఉంటామన్నారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారుల ను ఆదేశించారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, జలశక్తి మిషన్ నుంచి నిధులు మంజూరు చేయించి ప్రజల దాహార్తి తీర్చాలని కేంద్రమంత్రిని కోరారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో చెరువుల మరమ్మతులు, చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.500 కోట్ల నిధులు అవసరమవుతాయని, వాటిని మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి డీపీఆర్ తయారు చేసి పంపాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే రింగ్‌రోడ్డు, రైల్వేలైన్ నిర్మాణం ఆగిందని, వెంటనే పూర్తి చేసేందుకు కేంద్రమంత్రి సహకారం కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



రైల్వేలైన్ పనులను పరిశీలించేందుకు వెళ్తున్న కేంద్ర మంత్రి

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

మడకశిరటౌన్: రైల్వేలైన్ నిర్మాణ పనులను పరిశీలించడానికి శనివారం మడకశిరకు వచ్చిన రైల్వే, జలజీవన్ శాఖ సహాయ మంత్రి వి.సోమణ్ణకు ఘన స్వాగతం లభించింది. ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కేంద్రమంత్రి ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమై నియోజకవర్గం అభివృద్ధి పట్ల చర్చించారు. నియోజకవర్గంలో సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు సైతం పాల్గొని గజమాలతో సత్కరించారు. ఈప్రాంతం అభివృద్ధి పట్ల వినతులు అందించారు.

ముందుచూపున్న నాయకుడు చంద్రబాబు

: కేంద్ర మంత్రి సోమణ్ణ

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పట్ల ముందు చూపున్న గొప్ప వ్యక్తి అని కేంద్రమంత్రి సోమణ్ణ అన్నారు. శనివారం మడకశిరలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇద్దరి నాయకత్వంలో దేశం, రాష్ట్రం ప్రగతి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువుల మరమ్మతుల కోసం ఒక ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వక్కలిగలు, లింగాయతు, సాదర కులస్తులను ఓబీసీలోకి చేర్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ సాధికార కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, కర్ణాటక ప్రాంతానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నియోజకవర్గ నాయకులు

రైల్వే పనుల పరిశీలన

పావగడ: ఆంధ్రప్రదేశ్‌లోని రాయదుర్గం నుంచి కర్ణాటకలోని తుమకూరు వరకు 207కి.మీ. రైల్వే లైన్ నిర్మాణ పనులను కేంద్ర రైల్వేశాఖ, కేంద్ర జనవనరుల సహాయశాఖ మంత్రి సోమణ్ణ పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 63కి.మీ. పనులు పూర్తయ్యి రైలురాకపోకలు జరుగుతుండగా కర్ణాటకలో ఇంకా భూసేకరణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను మంత్రి హెచ్చరించారు.

జనసంద్రంగా గూగూడు

దర్శనం కోసం రెండు కిలో మీటర్లు క్యూకట్టిన భక్తులు

ఇబ్బందులు పడిన మహిళలు, చిన్నారులు



ప్రత్యేక అలంకరణలో గూగూడు కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల, జూలై 13: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయిస్వామి నిత్య పూజ నివేదిన శనివారం జనసంద్రంగా మారింది. రెండవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు గూగూడుకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి దాదాపు రెండు కిలో మీటర్ల మేర క్యూలైన్‌లో భక్తులు నిలబడి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, కుళ్లాయిస్వామికి చక్కెర చదవింపులు చేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు వారిని అదుపుచేయలేక నానా అవస్థలు పడ్డారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భక్తులకు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీరు అందజేశారు.



అగ్నిగుండం ముందు భక్తజనం

నేడు చిన్న సరిగెత్తు

గూగూడు కుళ్లాయిస్వామి చిన్న సరిగెత్తు ఆదివారం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. 15న నిత్య నివేదిన పూజ, 16న పెద్దసరిగెత్తు, 17న అగ్ని గుండం ప్రవేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శోభ, గ్రామ పెద్దలు జాఫర్‌వలి, రాజన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 30 టీఎంసీల నీరు

బొమ్మనహాళ్, జూలై 13: తుంగభద్ర జలాశయం 30.690 టీఎంసీలు చేరాయి. శనివారం నాటికి 18,060 క్యూసెక్కులకు చేరింది. వారంరోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చు తగ్గుదల మధ్య కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీలకు గాను 30.690 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉన్నాయి. అవుట్ ఫ్లో 210 కూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1606.21 అడుగుల వరకు నీరు చేరాయి. జలాశయం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గుతోంది.

తగ్గిన చీనీ ధరలు

అనంతపురంరూరల్, జూలై 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో చీనీధరలు తగ్గాయి. గత కొన్నిరోజులుగా స్థిరంగా పలుకుతున్న ధరలు శనివారం తగ్గాయి. శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 753టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.48

అనంతపురం రూరల్, జూలై 13: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 80టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.42, కనిష్ఠ ధర రూ.33 పలికినట్లు ఆయన తెలిపారు.

పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, జూలై 13: పాలిటెక్నిక్ కోర్సుల ద్వితీయ సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించనున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని 18న స్పాట్ అడ్మిషన్స్ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో పాటు హాజరు కావాలని కోరారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

గుంతకల్లుటౌన్, జూలై 13: పట్టణంలోని రైల్వే క్రీడా మైదానంలో సోమవారం జిల్లా కబడ్డీ మహిళలు, పురుషుల జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులో ఆగస్టు 2,3,4 తేదీల్లో పాముజూల శ్రీనివాసులు, మహాలక్ష్మి మెమోరియల్ 11వ ఆంధ్రరాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు సంబంధించి మహిళలు 75కేజీల విభాగం, పురుషులు 85కేజీల విభాగంలో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

ఐటీఐ హాల్ టిక్కెట్ల జారీలో జాప్యం

30వ తేదీకి మారిన పరీక్షలు

కాపీయింగ్‌కు రూ.4 వేల చొప్పున వసూలు

గుంతకల్లు, జూలై 13: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) విద్యార్థులకు హాల్ టిక్కెట్ల జారీలో సాంకేతిక లోపం ఏర్పడిన కారణంగా పరీక్షలు పదిహేను రోజులు వాయిదాపడ్డాయి. ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించాల్సిన పరీక్షలు ఆగస్టు 1వ తేదీకి మారాయి. సాంకేతిక సమస్య కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 4 వేల మందికి హాల్ టిక్కెట్లు జనరేట్ కాలేదని సమాచారం. ఈ కారణంగా పరీక్షలను 15 రోజులు ఆలస్యంగా నిర్వహించడానికి నిర్ణయించారు. కాగా ఐటీఐ పరీక్షలకు ఇంకా ఎగ్జామినేషన్ సెంటర్లను ఖరారుచేయలేదు. ఈనెల 24వ తేదీ లోపు విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లను చేర్చి ఆగస్టు 1వ తేదీ నుంచి పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు రాయదలచిన విద్యార్థులకు ఈనెల 10వ తేదీ వరకూ ఫీజు కట్టే అవకాశం ఉండగా, సప్లిమెంటరీ విద్యార్థుల సౌలభ్యం కోసం 15వ తేదీ వరకూ గడువును పొడిగించారు.

విద్యార్థుల నుంచి డబ్బు వసూలు

పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిపించడానికి ఐటీఐల నిర్వాహకులు విద్యార్థుల నుంచి రూ. 4 వేలు వసూలు చేస్తున్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి ఐటీఐలలో దాదాపు 900 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గుత్తిలో ఒకటి, కొనకొండ్లలో ఒకటి, గుంతకల్లులో ప్రభుత్వ ఐటీఐతో కలిపి ఐదు ఐటీఐలు ఉన్నాయి. గుత్తిలో ఒకే కళాశాల ఉండటంతో అందులోని విద్యార్థులకు అనంతపురం సెంటరు లభిస్తోంది. గుంతకల్లులో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు అదే విద్యా సంస్థలో పరీక్షలు రాస్తారు.

కానీ మిగతా నాలుగు ఐటీఐలు ఎగ్జామ్ సెంటరుగా కొనకొండ్ల ఐటీఐ వచ్చేలా పైరవీలు చేస్తున్నారు. గతంలో ప్రైవేటు ఐటీఐల విద్యార్థులకు ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో నిర్వహించేవారు. అక్కడ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకపోవడంతో గత పదేళ్లుగా కొనకొండ్ల ఐటీఐలో పరీక్షలు నిర్వహించేలా మేనేజ్ చేస్తున్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిపించడం కోసం, కావాల్సిన ఎగ్జామ్ సెంటరు వచ్చేలా చేయడం కోసం అధికారులకు డబ్బు ఎరచూపడానికి విద్యార్థులు ఒక్కొక్కరి నుంచి రూ.4 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. కాపీయింగ్‌తో పాస్ కావచ్చన్న కారణంగా విద్యార్థులు సాంకేతిక విద్యను సక్రమంగా అభ్యసించడం లేదు. చివరకు ప్రాక్టికల్స్‌లో కీలకంగా ఉన్న డ్రాయింగ్ పరీక్షలో కూడా ఇతరుల చేత చిత్రాలను వేయించి పాస్ చేయించాల్సిన దుస్థితి పట్టింది. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తేతప్ప విద్యార్థులకు సాంకేతిక విద్యను ఒంటబట్టే అవకాశాలు లేవు. పరీక్షలను ఊరికి దూరంగా ఉన్న ప్రైవేటు విద్యా సంస్థ వెంకటేశ్వర ఐటీఐలో నిర్వహించకుండా ఎస్కేపీ కళాశాలలో నిర్వహించాల్సిన అవసరం ఉంది.

మామిడితోటలో గంజాయి మొక్కలు



మామిడి తోటలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు, సిబ్బంది

రాయదుర్గం రూరల్, జూలై 13: మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామంలోని ఓ మామిడి తోటలో గంజాయి సాగు చేస్తున్నట్లు సెబ్ అధికారులు గుర్తించారు. రైతు సందీప్ కుమార్ తోటలో కాపలాదారు వన్నూరుస్వామి రహస్యంగా వీటిని పెంచుతున్నట్లు గుర్తించామని సెబ్ ఏఎస్పీ రామకృష్ణ శనివారం తెలిపారు. సందీప్‌కుమార్ తొమ్మిది ఎకరాలలో మామిడిచెట్లు సాగుచేశాడని, ఈ తోటకు తొమ్మిది నెలల నుంచి వన్నూరుస్వామి కాపలాదారుగా ఉన్నాడని తెలిపారు. మామిడి చెట్ల మధ్యలో బంతిపూలు, కనకంబరాలను సాగు చేశారని, వాటి మధ్యలో వన్నూరుస్వామి నాలుగు గంజాయి మొక్కలను రహస్యంగా పెంచాడని తెలిపారు. సెబ్ విభాగం డీటీఎఫ్ సీఐ వెంకటలక్ష్మికి సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని తెలిపారు. తోటలో పెంచిన నాలుగు గంజాయి మొక్కలను తొలగించి, సీజ్ చేశామని అన్నారు. వాటి బరువు 7.25 కిలోలు ఉందని, విలువ రూ.21 వేలు ఉంటుందని తెలిపారు. వన్నూరుస్వామిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ మారాలి: శైలజానాథ్



మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, జూలై 13: బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌లో మార్పు రావాల్సిన అవసరం ఉందని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా బీజేపీలో మార్పు రాలేదని అన్నారు. రాజ్యాంగ హత్యా దినం అనడం బాధాకరమని అన్నారు. 'మీరు 400 సీట్లు అడిగితే ప్రజలు మిమ్మల్ని మైనార్టీలో నిలబెట్టారు. మీ పరిస్థితి ఏమిటో దీన్ని బట్టే అర్థమౌతోంది.' అని విమర్శించారు. ఏపీ పొత్తు లేదంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం లేదని అన్నారు. అలాంటి ఏపీకి ఏమి చేశారని మండిపడ్డారు. బీజేపీ క్రూరమైన ఆలోచనా విధానాల్లో ఏ మాత్రం మార్పు లేదని అన్నారు. నోట్లు రద్దు చేసి.. లక్ష అబద్ధాలు చెప్పి.. ధనవంతులకు ఎలా ఉపయోగపడ్డారో అందరికీ తెలుసని అన్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగి ప్రజలు ఎంతో మంది చనిపోయారని, ఆ హత్యలన్నీ బీజేపీ ఖాతాలోకే వస్తాయని అన్నారు. మణిపూర్‌లో అంత దారణ పరిస్థితి ఎర్పడితే.. ఇప్పటికీ ప్రధాని అక్కడికి పోలేదని విమర్శించారు. రాహుల్ గాంధీ ఇప్పటికే ఒక సారి వెళ్లి వచ్చారని, మరోసారి వెళ్లాలని చూస్తే అడ్డుకున్నారని అన్నారు. 'మా ప్రాంతానికి ఇచ్చిన మాటను మీరు తప్పారు. ఆ రోజును విశ్వాసఘాతుక దినం అని మేము ప్రకటించవచ్చా..?' అని నిలదీశారు. రాష్ట్ర విభజన చట్టంలో చెప్పింది ఏమిటి..? మీరు చేసింది ఏమిటి అని నిలదీశారు.

తలుపు తీయండ్రా బాబూ..!



కుక్క భలే దర్జాగా కుర్చీలో కూర్చుంది..! ఎవరిదో..! అనుకుంటున్నారా..? దర్జా లేదూ.. పాడూ లేదు..! పాపం వీధి కుక్క అది. గాండ్లపెంట మండలం సోమయాజులపల్లి గ్రామ స చివాలయంలోని అలవాటు ప్రకారం శుక్రవారం వెళ్లింది. సా యంత్రం వరకూ సిబ్బందితో కలిసి అక్కడే విధులు నిర్వర్తించి.. అలసిపోయి నిద్రించినట్లుంది. దాన్ని చూడకుండా సచివాలయ సిబ్బంది తాళం వేసుకుని వెళ్లిపోయారు. ఏం చేయాలో ది క్కుతోచక రాత్రంతా అక్కడే గడిపింది. మధ్య మధ్యలో భౌ..భౌ మని మొత్తుకుంది. రాత్రంతా దాని గోల భరించిన స్థానికులు.. శనివారం ఉదయం అక్కడికి వెళ్లి చూశారు. కుర్చీపై కుక్క ఇలా దర్జాగా కూర్చుని కనిపించింది. ఫొటో తీసి.. సచివాలయ సిబ్బందికి పంపించారు. 'ఇదీ.. మీ నిర్వాకం..' అన్నట్లుగా..! 'ఎవరో ఒకరు వచ్చి తలుపులు తీస్తాంలే..' అని చెప్పారట. రెండో శనివారం సెలవు.. ఆదివారం సెలవు..! ఎవరూ రాకపోయుంటే.. దానిది కుక్క చావే..! ఇంకొక్కసారి సచివాలయం లోపలికి అడుగు పెట్టదనకుంటా..!

\- గాండ్లపెంట

దళిత, గిరిజనులపై దాడులు ఆపాలి



మాట్లాడుతున్న సాకే హరి

అనంతపురం సెంట్రల్, జూలై 13: ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక మంది దళిత, గిరిజనులను బలితీసుకున్నారని కూటమి ప్రభుత్వం లోనూ ఇదే తంతు కొనసాగుతోందని, ఇప్పటికైనా దాడులు ఆపాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి కోరారు.ఆదోని మండలం నాగనాథహళ్లి గ్రామానికి చెందిన గుండమ్మను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని శనివారం ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహంవద్ద నల్లరిబ్బన్‌లు ధరించి ఆందోళన చేపట్టారు. సాకేహరి మాట్లాడుతూ కష్టపడి కొన్న భూమిని ఆక్రమించుకునేందుకు రాగప్పరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజు తదితరులు గుండమ్మపై ట్రాక్టర్ ఎక్కించి హత్యచేయడం దుర్మార్గమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో శవాలను డోర్‌డెలవరీ చేసిన విధానం కూటమి ప్రభుత్వంలో కొనసాగుతోందని వాపోయారు. నాయకులు రామకృష్ణ, మల్లికార్జున, నారాయణస్వామి, కుమార్, రమేష్, భూదిగుమ్మప్ప, ఓబులేసు, గణేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

కార్బన్ ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన



సదస్సులో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

అనంతపురం న్యూటౌన్, జూలై 13: కార్బన్ ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు అగ్రిఫారెస్ట్రీ 2024-25 ప్రాజెక్ట్‌లో భాగంగా రెన్యూ, సేక్రీ, హ్యాండ్ సంస్థలు సంయుక్తంగా గుత్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ప్రాజెక్టు ద్వారా చేపట్టే అంశాలను రైతులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు లాభసాటిగా ఉండేలా పండ్ల మొక్కలు పెంచడంపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎర్రచందనం, టేకు, మహాగని లాంటి మొక్కలు అటవీశాఖ నుంచి ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. వాటిని పెంచడం ద్వారా రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. సదస్సులో రెన్యూ ప్రతినిధులు కార్తీక, పవన్ భగవతి, ఇందుస్రీ, హర్షితా చావ్లా, సేక్రీ ప్రతినిధులు మహీధర్ రెడ్డి, అనురాగ్, మనోహర్, హేమేంద్ర, పీరావలీ, నారాయణస్వామి, శివ శంకర్‌తో పాటు ఐదు మండలాల నుంచి రైతులు పాల్గొన్నారు.

తల్లి పేరుపై మొక్క నాటి.. సంరక్షించాలి



మొక్క నాటుతున్న సిబ్బంది, స్థానికులు..

అనంతపురం న్యూటౌన్, జూలై 13: ప్రధాని మోదీ పిలుపు మేరకు తల్లి పేరుపై మొక్కనాటి వాటిని సంరక్షించాలనే కార్యక్రమాన్ని జిల్లాలో డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాలకు స్థానిక సిబ్బంది శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉప్పరపల్లి పంచాయతీ బీట్ ఆఫీసర్ మారెప్ప, పంచాయతీ సెక్రటరీ ప్రేమ్‌కుమార్ సంయుక్తంగా చెత్తతో సంపద కేంద్రం వద్ద స్థానికులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. స్థానికులతో మొక్కలు నాటించి ప్రధాని మోదీ పిలుపు మేరకు తల్లి పేరుపై మొక్క నాటి వాటి సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇంజనీర్ అయూబ్, ఏబీఓ గిరీష్, టెక్నికల్ అసిస్టెంట్ సుజాత, సీఓ శివకుమార్‌తో పాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థ పంటల నిర్వహణతో పర్యావరణ పరిరక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బీఎం నాందేడ్

గార్లదిన్నె, జూలై 13: వ్యర్థ పంటల నిర్వహణతో పర్యావరణ పరిరక్షించుకోవచ్చని దక్షిణక్షేత్ర యంత్రాల నిర్వహణ పరీక్ష సంస్థ (ట్రాక్టర్‌నగర్) డైరెక్టర్ బీఎం నాందేడ్ అన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని ట్రాక్టర్ నగర్‌లో వ్యర్థ పంటల నిర్వహణపై శనివారం విద్యార్థులకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ వ్యర్థాలు పొలంలోనే కుళ్లే విధంగా పంటల వ్యర్థాలు నిర్వహిస్తే కాలుష్యం నుంచి పర్యావరణాన్ని రక్షించుకోవచ్చన్నారు. నేలలో పోషకాలు పెరిగి సూక్ష్మజీవులు, పోషకాల ద్వారా నేల, ఎక్కువ నీటి శాతాన్ని పట్టుకునే విధంగా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. వ్యవసాయంలో వినియోగించే వివిధ యంత్రాలపై అవగాహన కల్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి శిక్షణకు వచ్చిన విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

రిజర్వ్ ఫారెస్ట్ తనిఖీ

అనంతపురం న్యూటౌన్, జూలై 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌ను శనివారం స్క్వాడ్ రేంజర్ వెంకటరమణ తనిఖీ చేశారు. ముచ్చుకోట రిజర్వ్ ఫారెస్ట్, బెళుగుప్ప రిజర్వ్ ఫారెస్ట్‌లోని బౌండరీలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఎక్కడ రిజర్వ్ ఫారెస్ట్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడటంలో భాగంగా బౌండరీలు పరిశీలించామన్నారు. స్థానిక సిబ్బంది చేపట్టిన పనులను కూడా తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో బీట్ ఆఫీసర్ ప్రతాప్‌తో పాటు స్థానిక సిబ్బంది జగన్నాథ్, సుధాకర్ ఉన్నారు.

ముగిసిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ

అనంతపురం టౌన్, జూలై 13: క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహణపై వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన శిక్షణ తరగతులు శనివారం ముగిసినట్లు డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి తెలిపారు. నెలరోజులుగా జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణలో 18 ఏళ్ల పైబడిన వారందరికీ ఎలాంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి, మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌కు పరీక్షలు ఎలా చేట్టాలనే దానిపై మెడికల్ ఆఫీసర్లకు, ఏఎన్ఎంలకు, స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. మొత్తం 18 బ్యాచ్‌లతో కలిపి 7,765 మందికి శిక్షణ ఇచ్చామన్నారు.

ముళ్ల కంపల తొలగింపు



పాలబావికి వెళ్లే దారికిరువైపులా తొలగించిన ముళ్ల కంపలు

రాప్తాడు, జూలై 13: మండలంలోని బండమీదపల్లి గ్రామంలో జనసేన, టీడీపీ నాయకులు రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్లకంపలను శనివారం తొలగించారు. జనసేన పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, పవన్, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, నాయుడు, రామాంజి, శివప్రసాద్, ఆది, భాస్కర్ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శ్మశాన వాటిక, వరిమడుగు, పాలబావి గ్రామాలకు వెళ్లేదారికి ఇరు వైపులా ఉన్న ముళ్ల కంపలు తొలగించారు. బండమీదపల్లి నుంచి వరిమడుగు, బండమీదపల్లి నుంచి పాలబావికి వెళ్లే దారికి ఇరువైపులా ముళ్ల కంపలు ఎక్కువగా పెరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. స్పందించిన జనసేన నాయకులు ఎక్స్‌కవేటర్‌తో ముళ్లకంపలు తొలగించారు. అలాగే శ్మశానవాటికలో ముళ్ల కంపలు తొలగించి శుభ్రపరిచారు.

అక్రమాలకు పాల్పడితే మూల్యం తప్పదు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



శ్రీనగర్ కాలనీలో రోడ్డు తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జూలై 13: అనంతపురం అర్బన్‌లో అక్రమ నిర్మాణాలు, నిబంధనల అతిక్రమణకు ఎవరు పాల్పడినా మూల్యం తప్పదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హెచ్చరించారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో ఓ కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యం అక్రమంగా రోడ్డును తవ్వి డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు శుక్రవారం అర్ధరాత్రి రోడ్డును తవ్వుతుండగా స్థానికుల సమాచారంతో ఎమ్మెల్యే స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి అప్పటికప్పుడు పనులు ఆపించారు. శనివారం ఉదయం నేరుగా శ్రీనగర్ కాలనీలో అక్రమంగా రోడ్డు తవ్వుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. నగరపాలక సంస్థ అధికారులను పిలిపించి ఇలా అక్రమంగా రోడ్డు తవ్వి డ్రైనేజీ కట్టి ఆస్పత్రి వ్యర్థాలు వదిలేందుకు ఎవరు అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. ఇలాంటి అక్రమాలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని అధికారులపై సీరియస్ అయ్యారు. సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని, వెంటనే ఈ పనులు పూర్తిగా ఆపేయాలని ఆదేశించారు.

స్థలాలిచ్చి.. ఇళ్లు కట్టిస్తాం

మీరు ఇళ్ల స్థలాలు అడుతున్నారు.. మేము ఏకంగా ఇళ్లే కట్టించి ఇస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నగరపాలక సంస్థ కార్మికులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో 16 రోజులపాటు కార్మికులకు ఇళ్ల స్థలాలు, కార్మికుల సంఖ్య పెంపు కోసం పోరాటం చేశామన్నారు. అప్పట్లో పాలకవర్గం స్పందించి ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పినా ఇప్పటి దాకా నెరవేర్చలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బుక్కరాయసముద్రంలోని దేవరకొండ పక్కన తాము గుడిసెలు వేసుకొని 8 నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన 188 మంది కార్మికుల స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. కార్మికుల సంఖ్య పెంచడంపై సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే దగ్గుపాటికి వినతిపత్రం ఇస్తున్న నగరపాలక సంస్థ కార్మికులు

రామానుజ పైళాదాస్‌పై చర్యలు తీసుకోవాలి



సంఘీభావం తెలుపుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 13: బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు బ్రాహ్మణ స్త్రీలను వేశ్యలుగా పేర్కొంటూ మన్యం జిల్లా పార్వతీపురం ఏరియాలో ప్రచారం చేస్తున్న రామానుజ పైళాదాస్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి డిమాండ్ చేశారు. శనివారం సమాఖ్య జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బ్రాహ్మణ జాతిని నీచాతినీచంగా కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఈ వ్యాఖ్యలపై రామానుజ పైళాదాస్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా ఉన్న అర్చక పురోహితులంతా ఆదివారం ఉదయం 8 గంటలకు ధూపదీప నైవేద్యాలు ముగించుకుని ఎక్కడికక్కడ నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్ని మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లలో రామానుజ పైళాదాస్‌పై కేసులు నమోదు చేయించాలని సూచించారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణశర్మ, ఉపాధ్యక్షుడు మురళీధర్, కోశాధికారి పట్నం విశ్వేశ్వరరావు, సభ్యులు మురళి, మారుతీ నరసింహం, చంద్రకాంత్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 13: గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ.250 కోట్ల నిధులు విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబుకు పంచాయితీరాజ్ చాంబర్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, సభ్యులు.. సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జీపీఎస్‌పై గెజిట్ విడుదల సరికాదు

అనంతపురం విద్య, జూలై 13: జీపీఎస్‌పై గెజిట్ విడుదల చేయడం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 అక్టోబర్ నుంచి సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ..గెజిట్ ఇవ్వడం చూస్తుంటే... ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. 2017లో కేంద్రం ఇచ్చిన మెమో 57ను వెంటనే రద్దు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన టీచర్లను ఓపీఎస్ పరిధిలోకి తేవాలన్నారు.

ఎంఈఓ-2 రాష్ట్ర కమిటీలోకి ముగ్గురికి చోటు

అనంతపురం విద్య, జూలై 13: మండల విద్యాశాఖాధికారులు(ఎంఈఓ)-2 అసోసియేషన్ రాష్ట్ర కమిటీలోకి జిల్లా నుంచి ముగ్గురికి చోటు కల్పించారు. శనివారం గుంటూరులోని గీతా రీజెన్సీలో నిర్వహించిన ఆ యూనియన్ సమావేశంలో కొత్త రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లాకు చెందిన గురుప్రసాద్‌ను రాష్ట్ర సహాధ్యక్షులుగా, సలహాదారుడిగా రామచంద్ర, అదనపు కార్యదర్శిగా మదన్‌మోహన్‌ను ఎంపిక చేశారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థినుల ఎంపిక



అభినయ



నవ్యశ్రీ

రామగిరి, జూలై 13: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థినులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సర్వేశ్వరి శనివారం తెలిపారు. రామగిరికి చెందిన బెస్త అభినయ, బెస్త నవ్యశ్రీ ఎంపికయ్యారన్నా రు. మోడల్ స్కూల్ విద్యార్థినులు ఎంపిక కావడంపట్ల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు అభినందించారు. పాఠశాలలో విద్యార్థినులకు మెరుగైన విద్యను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

శాస్త్రోక్తంగా ఏడు శనివారాల వ్రతం



అలంకరణలో సత్యనారాయణస్వామి

అనంతపురం కల్చరల్, జూలై 13: ఆషాఢమాసం శనివారాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాల్లో ఏడు శనివారాల వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ భక్తులు సామూహికంగా వ్రతాలు ఆచరించారు. అనంతరం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు.



వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

అంకితభావంతో పనిచేయండి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

నార్పల, జూలై 13: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలలో పోలీసులు అంకితభావంతో పనిచేయాలని డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. శనివారం గూడూడు గ్రామాన్ని డీఎస్పీ సందర్శించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున వస్తారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సీఐలు శ్రీధర్, యోగానంద, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షం కోసం కప్పలకు పూజలు



కప్పలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

శింగనమల జూలై 13: గ్రామాల్లో రైతులు, ప్రజలు వర్షాలు కురవాలని పూజలు చేస్తున్నారు. ఆదివారం మండలంలోని సీ బండమీదపల్లి గ్రామంలో రైతులు, గ్రామపెద్దలు కలసి కప్పలను గ్రామంలో ఊరేగింపు చేశారు. ప్రతి ఇంటి వద్ద కప్పలకు నీరు పోశారు. అనంతరం బోడ్రాయికి 101 బిందెలతో అభిషేకించి, ప్రత్యేక పూజలు చేశారు.

పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలకు ఏఐసీటీఈ గ్రాంటు



అటల్ బేసిక్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగామ్ నిర్వహణకు సంబంధించిన పత్రాలు అందుకుంటున్న పీవీకేకే విద్యాసంస్థల చైర్మన్

అనంతపురంరూరల్, జూలై 13: పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల ఐటీఆర్అండ్‌డీ, ఈఈఈ విభాగానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ద్వారా రూ.3.5లక్షల గ్రాంటు విడుదలైనట్లు విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల పరిశోధన, అభివృద్ధి విభాగం, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రతిపాదించిన ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ అనే అంశాన్ని పరిశీలించి ప్రాజెక్టులను మరింత వృద్ధికి ఏఐసీటీఈ పరిశోధనకు ఆమోదించిందన్నారు. అటల్ బేసిక్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) కార్యక్రమం నిర్వహణకు గ్రాంటు విడుదుల చేసిందన్నారు. ఆ మేరకు శనివారం కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన పత్రాలను అందుకున్నట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ కేసీ కుల్లాయప్ప, అటల్ ఎఫ్‌డీపీ కన్వీనర్ శ్రీనివాసన్, కోకన్వీనర్ హరిప్రసాద్, ఆనంద్ దంపెళ్లను అభినందించారు. కోశాధికారి పల్లె సింధూరారెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి బొర్దాన పాల్గొన్నారు.

కక్కలపల్లి రోడ్డుకు మరమ్మతులు

● పరిటాల శ్రీరామ్ సొంత ఖర్చులతో పనులు

అనంతపురంరూరల్, జూలై 13: నిత్యం వందలాది వాహనాలు తిరిగే రోడ్డు అది. స్థానికులేకాకుండా వివిధ ప్రాంతాల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డంతా గుంతలమయం. ప్రయాణం చేయాలంటే వాహనదారులు, జనం ఒళ్లు హూనం అయ్యేది. తరచూ ప్రమాదాలు జరిగేవి. ఇదీ కక్కలపల్లి టమోటా మార్కెట్ రోడ్డు దుస్థితి. ఎవరైనా ఆ రోడ్డు అంటే అమ్మో అనేవారు. ఆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ వచ్చింది. ప్రస్తుత ఆ రోడ్డు రాకపోకలు సాగించేవారికి కొంత ఉపశమనం దక్కింది. ప్రభుత్వం మారడంతో అక్కడి వ్యాపారులు వాహనదారులు ఇటీవల ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో రోడ్డు మంజూరయ్యేలోగా సమయం పడుతుందని భావించి అక్కడికి ఎక్స్‌కవటేర్లు, టిప్పర్లు, రోలర్లు పంపించారు. గుంతలు పడిన ప్రాంతంలో మట్టితోరోడ్డు పనులను సొంత ఖర్చులతో చేపట్టారు. సమస్యను పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించినందుకు వ్యాపారులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే బీటీ రోడ్డు వేయిస్తామని పరిటాల శ్రీరామ్ హామీ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.



కక్కలపల్లి టమోటా మార్కెట్ వద్ద చేపడుతున్న మట్టిరోడ్డు పనులు

చదువు, ఆరోగ్యంపై అవగాహన



టైప్‌వన్ డయాబెటీస్‌పై అవగాహన కల్పిస్తున్న పద్మినీ రంగరాజన్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 13: తోలుబొమ్మలాట ద్వారా చదువు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుకేటర్ పద్మినీరంగరాజన్. ఆర్డీటీతో కలిసి పనిచేయడంలో భాగంగా మొదటిరోజు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో ఎడ్యుకేషనల్ పప్పెటియర్, డిప్లొమా ఇన్ పప్పెట్ థెరపీ, తోలుబొమ్మలాట ద్వారా చదువు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. తోలుబొమ్మలాట ద్వారా తీసుకునే ఆహారం, అలవాట్లు, ఇన్సులిన్ వాడే విధానం, మానసిక స్థైర్యాన్ని పెంచడం, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించడం, డయాబెటిక్ అంటువ్యాధి కాదని, తోటి పిల్లలతో కలిసి మెలిసి ఉండాలని టైప్‌వన్ డయాబెటీస్‌పై అవగాహన కల్పించారు. ఇందుకు కేంద్రప్రభుత్వం యువజన, సాంస్కృతికశాఖ ద్వారా ఫెలోషిప్ సాధించినట్లు తెలిపారు. టైప్‌వన్ డయాబెటీస్‌పై అవగాహన కోసం సెల్ నంబరు 9866081172లో సంప్రదించాలని కోరారు. ఆర్డీటీ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం విద్య, జూలై 13: జిల్లాలో వ్యాయామ విద్య అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్లనున్నట్లు పీఈటీ అండ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆ సంఘం నాయకులు సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో జరగాల్సిన వ్యాయామ విద్య అభివృద్ధి, సెమినార్ తదితర అంశాలపై చర్చించారు. యూనియన్ ఆధ్వర్యంలో వ్యాయామ విద్యపై సెమినార్ నిర్వహించడంతోపాటు, టోర్నమెంట్ సెప్టెంబరులో నిర్వహించనున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అక్కులప్ప, కార్యదర్శి సత్యనారాయణ, ట్రెజరర్ శివకేశవులు, పలు నియోజకవర్గాల సభ్యులు, సీనియర్ వ్యాయామ టీచర్లు నాగరాజు, కుమార్ రాజా, మారుతి, లింగమయ్య, నందకుమార్, రాగేష్, నాగరాజు, ప్రసన్న, సంజీవరాయుడు పాల్గొన్నారు.

వాకర్ హ్యాండ్ స్టిక్స్ పంపిణీ



వాకర్ స్టిక్స్ పంపిణీ చేస్తున్న మారుతీనాయుడు

శింగనమల జూలై 13: ఎముకల్లో పటుత్వం తగ్గిన వారికి ప్రభుత్వం ఉచితంగా సపోర్టింగ్ ఉపకరణ వస్తువులు అందిస్తున్నట్లు తరిమెల వైద్యాధికారి శంకర్ నాయక్ తెలిపారు. శనివారం మండలంలోని పెరవలి గ్రామంలో ఫ్లోరోసిస్ కార్యక్రమంలో భాగంగా ఎముకల్లో పటుత్వం తగ్గిన వారికి సర్పంచ్ రాజు, టీడీపీ మండల నాయకుడు మారుతీనాయుడు చెతులమీదగా వాకర్స్ లంబార్‌బెల్ట్ హ్యాండ్ స్టిక్స్ మెదడి విడతగా పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది అశ్వత్థనారాయణ, అనూష, నాగరాజు, ఆశాబీ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం పడింది. రాయదుర్గం, డి.హిరేహాళ్ మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. అనంతపురం, గార్లదిన్నె, నార్పల, ఉరవకొండ, గుత్తి, పుట్లూరు, బొమ్మనహాల్, యాడికి తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తాడిపత్రి, జూలై 13: పట్టణ సమీపంలోని ఆటోనగర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు పీరా (65) మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పీరా వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవారు. ఓ పని నిమిత్తం శనివారం ఆయన బైక్‌పై తాడిపత్రికి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా.. ఆటోనగర్ సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య హుస్సేన్‌బీతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు టోపీసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె, జూలై 13: మండలంలోని పెనకచెర్ల డ్యాం సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలు ముగ్గురు గాయపడ్డారు. అంకంపేట గ్రామానికి చెందిన ఓబిరెడ్డి, భార్య సువర్ణమ్మ పెన్నహోబిలం నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తున్నారు. పెనకచెర్ల డ్యాంకు చెందిన భార్గవ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో గ్రామం నుంచి డ్యాం వైపు వెలుతున్నాడు. డ్యాం సమీపంలోకి రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

ఉప సర్పంచుపై ఎస్సీ, ఎస్టీ కేసు

గార్లదిన్నె, జూలై 13: మండలంలోని కోటంక గ్రామ ఉపసర్పంచు యల్లారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోటంక గ్రామానికి చెందిన సుబ్బన్న, జిలకర ఆంజనేయులు, ఎర్రిస్వామి, వీరాంజనేయులు, సుబ్బులు భూమి విషయంలో గొడవపడి పోలీస్‌స్టేషన్ వచ్చారు. గ్రామ ఉప సర్పంచు పోలీస్ స్టేషన్ ఎదుటే నీవెప్పుడూ పంచాయితీలు చేస్తుంటావా అని కులం పేరుతో దుషించాడని సుబ్బన్న శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఉప సర్పంచు యల్లారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నల్లచెరువు, జూలై 13: మండల పరిధిలోని ఎన్‌హెచ్ 42 జాతీయరహదారిపై ఎర్రగుట్లపల్లి వద్ద చెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి(41) కుటుంబసభ్యులతో శనివారం ఉదయం కారులో తిరుపతికి వెళుతున్నాడు. నల్లచెరువు సమీపంలో ఎర్రగుంట్లపల్లి వద్ద కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కారులో అయిదుగురు ఉండగా ముగ్గురికి తీవ్రగాయాలు కాగా ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మిగిలిన ఇద్దరిని కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

ఆలూరుకోనలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భూదేవిశ్రీదేవి సమేత రంగనాథస్వామి

తాడిపత్రి, జూలై 13: మండలంలోని ఆలూరుకోనలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చనలు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలతోపాటు విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు.

నేమకల్లు ఆంజనేయుడికి విశేషపూజలు



స్వామిని దర్శించుకుంటున్న బళ్లారి ఏఎస్పీ

బొమ్మనహాళ్, జూలై 13: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు వేకువజామునే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు. తర్వాత విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు, నైవేద్యం సమర్పణ గావించి మహా మంగళహారతి ఇచ్చారు. బళ్లారి అడిషనల్ ఎస్పీ రవికుమార్ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ నాయకులు గాలి బసప్ప తదితరులు ఏఎస్పీని స్వాగతించి పూజలు జరిపించారు. ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదానం జరిగింది.

యథేచ్ఛగా గుట్కా విక్రయాలు

● నిబంధనలను పట్టించుకోని వ్యాపారులు
● చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



యాడికి, జూలై 13: మండలంలో గుట్కా విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వాటి విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ పలువురు వ్యాపారులు ఆ నిబంధనలను తుంగలో తొక్కారు. మండలకేంద్రంలో కొందరు గుట్కా వ్యాపారుల మధ్య విభేదాలు తలెత్తడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్థానిక కుంటలో ఉన్న పలు దుకాణాల్లో గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి మండలానికి గుట్కా ప్యాకెట్ల సరఫరా జరుగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. గుట్కా విక్రయాల్లో అధిక లాభాలు ఉండడంతో కొందరు వ్యాపారులు ఆ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే తప్ప గుట్కా విక్రయాలపై పోలీసులు దృష్టి సారించడం లేదని స్థానికుల నుంచి ఆరోపిస్తున్నారు. పోలీసులు తనిఖీలకు వచ్చే సమయాలను ముందే పసిగడుతున్న వ్యాపారులు గుట్కా ప్యాకెట్లను పక్కకు తరలించడం, ఆ తర్వాత విక్రయాలు కొనసాగిస్తుండడం సర్వసాధారణమైంది. ముఖ్యంగా రాయలచెరువులో జాతీయ రహదారి ఉండడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఇక్కడ గుట్కా విక్రయాలు కూడా అదే స్థాయిలో కొనసాగుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు గుట్కా విక్రయాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పుస్తక పఠనంతో గొప్ప విజయాలు

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సాహితీవేత్తలు

కళ్యాణదుర్గం, జూలై 13: పుస్తక పఠనంతో గొప్ప గొప్ప విజయాలు సాధించవచ్చని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. విద్యాసామాజిక చైతన్యం పుస్తకాన్ని ఆయన అనంతపురంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆవిష్కరించారు. విద్యాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్షారంభ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంచి పుస్తకాలను చదివితే మేధస్సు పెరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మంచి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడం అలవర్చుకుంటే గొప్ప విజయాలను సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

రామోజీకి నివాళి

మీడియా రంగం ద్వారా సమాజంలో అనేక మార్పులు తీసుకొచ్చిన రామోజీరావు ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలోని ఎస్వీ రెసిడెన్సీలో శనివారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. విజయాలను ఏ విధంగా సాధించాలో రామోజీరావును చూసి యువత నేర్చుకోవాలని అన్నారు. ఆయన చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాయన్నారు. పత్రికల్లో నైతిక విలువలు పాటిస్తూ సమాజంలో అనేక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. అంతకు మునుపు రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు, కవులు డాక్టర్ రాధేయ, బలరామాచార్య, శ్రీశైల ప్రభ, శ్రీదేవి, మల్లికార్జున, ప్రముఖ గాయకుడు లెనిన్, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కళ్యాణదుర్గంరూరల్, జూలై 13: పట్టణంలోని స్వామి వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామలింగప్ప, వైస్ ప్రిన్సిపాల్ శివన్న శనివారం ప్రకటనలో తెలిపారు. గ్రాస్ రూట్స్ ఆల్ సెక్ టెక్నాలజీ కంపెనీ ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నారన్నారు. 2022-2024 సంవత్సరాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. కళ్యాణదుర్గం పరిసర ప్రాంతాల్లోని అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9491750066కు సంప్రదించాలని తెలిపారు.

కళాశాల అభివృద్ధికి సాయమందిస్తాం

ఉరవకొండ,జూలై 13: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమవంతుగా సాయం అందిస్తామని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. కళాశాలలో న్యాక్‌ను పురస్కరించుకుని శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 1997నుంచి 2023వ విద్యాసంవత్సరం వరకూ చదువుకున్న పూర్వవిద్యార్థులు 70మంది హాజరయ్యారు. కళాశాల అభివృద్ధి కోసం రూ.50వేలు విరాళాన్ని అందజేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ మస్తానప్ప, విద్యార్థి సంఘం కోఆర్డినేటర్ అల్తాఫ్, సభ్యులు సుధాకర్, పరమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కేఎం రాజేష్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

కూడేరు, జూలై 13 : మండలంలోని ముద్దలాపురం గ్రామంలో మూడురోజుల క్రితం అప్పుల బాధతో రైతు వన్నూరప్ప ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ ఘటనపై శనివారం ఏఓ విజయకుమార్, వీఆర్‌ఓ రవి, ఎంపీఈఓ నస్రీన్ గ్రామంలోకి వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు భార్య వాణితోపాటు కుటుంబ సభ్యులు వేడుకున్నారు.

కంపచెట్ల తొలగింపు

పామిడి, జూలై 13: పట్టణంలో నుంచి కొత్తపల్లికి పోయే రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన కంపచెట్లను స్థానిక టీడీపీ నాయకులు జేసీబీతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మెన్ ప్రభాకర్‌చౌదరి మాట్లాడుతూ... ఎమ్మెల్యే జయరాం ఆదేశాల మేరకు కంపచెట్లను తొలగింపజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ గౌస్‌పీరా, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్, మాజీ కౌన్సిలర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారి ఆత్మహత్య

ఉరవకొండ, జూలై 13: పట్టణంలోని రాయంపల్లి రహదారిలో ఉన్న జగనన్న కాలనీలో నివాసముంటున్న మల్లికార్జున(52) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన స్థానిక పాత బస్టాండ్ సమీపంలో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇంటి నిర్మాణం, వ్యాపారం కోసం రూ.10లక్షలు దాకా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక శనివారం తీవ్ర మనస్థాపానికి గురై డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న పాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే వచ్చి పరిశీలించి అతను అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



పీరా (ఫైల్)

తాడిపత్రి, జూలై 13: పట్టణ సమీపంలోని ఆటోనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు పీరా (65) మృతిచెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పీరా వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవారు. కాగా ఓ పని నిమిత్తం శనివారం ఆయన బైక్‌పై తాడిపత్రికి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా.. ఆటోనగర్ సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొంది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య హుస్సేన్‌బీతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు టోపీసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ దుకాణం ప్రారంభం

ఉరవకొండ, జూలై 13: మండలంలోని లత్తవరం తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన చౌకధాన్య డిపోను స్థానిక టీడీపీ నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకుడు గోవిందు మాట్లాడుతూ.. డీలర్లు చౌక ధాన్య డిపోల ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం రైతు బజార్లు ఏర్పాటు చేసి తక్కువ ధరకే కందిపప్పు, నాణ్యమైన బియ్యాన్ని అందజేస్తోందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, నాయకులు నారాయణస్వామినాయక్, శంకర్‌నాయక్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

కార్బన్ ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన



సదస్సులో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

అనంతపురం న్యూటౌన్, జూలై 13: కార్బన్ ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్రి ఫారెస్ట్రీ 2024-25 ప్రాజెక్ట్‌లో భాగంగా రెన్యూ, సేట్రీ, హ్యాండ్ సంస్థలు సంయుక్తంగా గుత్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం సదస్సు నిర్వహించాయి. కార్యక్రమానికి స్థానిక ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ప్రాజెక్టు ద్వారా చేపట్టే అంశాలను రైతులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు లాభసాటిగా ఉండేలా పండ్ల మొక్కలు పెంచడంపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎర్రచందనం, టేకు, మహాగని లాంటి మొక్కలు అటవీశాఖ నుంచి ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. వాటిని పెంచడం ద్వారా రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. సదస్సులో రెన్యూ ప్రతినిధులు కార్తీక, వపన్ భగవతి, ఇందుశ్రీ, హర్షితా చావ్లా, సేట్రీ ప్రతినిధులు మహీధర్‌రెడ్డి, అనురాగ్, మనోహర్, హేమేంద్ర, వీరావలీ, నారాయణస్వామి, శివశంకర్‌తో పాటు ఐదు మండలాల నుంచి రైతులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు చిన్నపరెడ్డి



చిన్నప్పరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జూలై 13: రైతుల సంక్షేమాన్ని కోరి హెచ్చెల్సీని కణేకల్లుకు తీసుకురావడంలో సఫలీకృతులైన మాజీ ఎమ్మెల్యే చిన్నపరెడ్డి ఆదర్శప్రాయుడని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. చిన్నపరెడ్డి జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న ఆయన విగ్రహానికి శనివారం వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చేసిన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో రూరల్ బ్యాంక్ మాజీ కార్యదర్శి కృష్ణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ కన్వీనర్ ఆనంద్‌రాజ్, నాయకులు వేలూరు మరియప్ప, బీటీ రమేష్, అనిల్, కురుబ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని 13 పొట్టేళ్లు మృతి


గుత్తి రూరల్, జూలై 13: మండలంలోని శ్రీపురం గ్రామశివారులో 67వ జాతీయ రహదారిపై శనివారం లారీ ఢీ కొని 15 పొట్టేళ్లు మృతి చెందాయి. మరో పది పొట్టేళ్లకు గాయాలయ్యాయి. శ్రీపురానికి చెందిన రైతు పాపన్నకు 102 పొట్టేళ్లు ఉన్నాయి. ఉదయం గ్రామ శివారులోకి మేత కోసం తీసుకెళ్తుండగా.. రోడ్డులో లారీ వేగంగా వచ్చి వాటిపై దూసుకెళ్లింది. దీంతో 15 పొట్టేళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 జీవాలు కాళ్లు, నడుములు వీరికి అక్కడే పడి పోయాయి. స్థానికులు లారీని నిలబెట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేప్పట్టారు. బాధిత రైతు మాట్లడుతూ రూ.4లక్షల వరకు నష్టం వాట్టిల్లిందని వాపోయాడు.

బోరుబావిలోకి బండరాళ్లు

● ఆకతాయిల చేష్టలకు కరిగానపల్లిలో తాగునీటి ఎద్దడి

కుందుర్పి, జూలై 13: మండలంలోని కరిగానపల్లి గ్రామంలో ఆకతాయిలు చేసిన పనికి తాగునీటి సమస్య ఏర్పడింది. గ్రామంలో రెండు రోజుల క్రితం తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోరు బావిలో మోటార్ కాలిపోయింది. దానిని బాగు చేసేందుకు బయటకు తీశారు. మరమ్మతులు చేయించి శనివారం బోరు బావిలోకి దింపేందుకు వెళితే మోటారు దిగలేదు. దీంతో సర్పంచ్ నాగేంద్రకు సమాచారం అందించారు. గ్రామస్థులందరూ వచ్చి చూసి బోరుబావిలో బండరాళ్లు అడ్డుపడ్డట్టుగా గుర్తించి వాటిని తొలగించేందుకు తీవ్రప్రయత్నం చేశారు. ఇది ఆకతాయిల పనేనని గ్రామస్థులు మండిపడ్డారు. ఆకతాయిలు కావాలనే బోరుబావిలోకి బండరాళ్లు వేశారని తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. గ్రామంలో రెండు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని సర్పంచ్ నాగేంద్ర, టీడీపీ నాయకులు తెలిపారు.

ఘనంగా లక్ష్మీనారాయణ యజ్ఞం



పూజలందుకున్న ఉత్సవమూర్తులు

తాడిపత్రి, జూలై 13: పట్టణంలోని ఎస్‌ఎల్‌ఎన్ వరహాలు గార్డెన్స్‌లో లోకకల్యాణార్థం జరుగుతున్న భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం లక్ష్మీనారాయణ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల ఆరాధన, సాంప్రదాయ రహస్యాలు, గోపూజ, ద్వారతోరణ, సామూహిక శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామి వారు ప్రవచనాలు చేశారు. అంతకుమునుపు రామానుజ జీయర్‌స్వామివారు రుక్మిణీ సమేత శ్రీ కృష్ణ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండా సమావేశాలా?

● అధికారులపై టీడీపీ నాయకుల మండిపాటు

కూడేరు, జూలై 13: మండలంలోని గొట్కూరు గ్రామంలో శనివారం ఉపాధి పథకం పనులపై అధికారులు సమావేశం జరుపుతుండగా.. టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. సమావేశంపై ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. పంచాయితీలో మూడు గ్రామాలుంటే ఒక్క గ్రామంలో కూడా ముందుగా సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తుతూమంత్రంగా సమావేశం నిర్వహిస్తే అ క్రమాలు ఎలా బయటకు వస్తాయని నిలదీశారు. టీడీపీ నాయకులు గొట్కూరు జయరాం, మహమ్మద్, ప్రతాప్, కిష్ట, బాబు, బ్రహ్మణపల్లి వెంకటరామిరెడ్డి, సమావేశాన్ని అడ్డుకోవడంతో.. దిక్కుతోచని అధికారులు సమావేశం జరపకుండా వెనుదిరిగారు.

కాపు అనుచరులపై కేసు నమోదు

డీ.హీరేహాళ్, జూలై 13: మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అనుచరులు వెంకటరెడ్డి, శివరాజ్‌లపై శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. మండలంలోని సోమలాపురం గ్రామ సమీపంలో ఉన్న రైల్వేస్టేషన్ వద్ద మైనింగ్‌కు సంబంధించిన డంపింగ్ యార్డ్ ఉంది. రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చే ఐరన్‌ఓర్‌ను సోమలాపురానికే చెందిన పలువురు అక్కడ అన్‌లోడ్ చేసి అనంతరం టిప్పర్ల ద్వారా మండలంలో ఉన్న ఐరన్‌ఓర్ ఫ్యాక్టరీలకు పంపిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం ఒక రైల్వేవ్యాగన్ రాగా.. దీనిని అన్‌లోడ్ చేసే సమయంలో కాపు అనుచరులు వెంకటరెడ్డి, శివరాజ్ వచ్చి ఇంతకు మునుపు ఐరన్‌ఓర్‌ను ఫ్యాక్టరీలకు తాము తరలించేవారమని, ఇక మీరు తరలించకూడదని, అలా చేస్తే అంతు చూస్తామని బెదిరించారు. దీనిపై శనివారం టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు మొండి మల్లికార్జున పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని కాపు అనుచరులపై ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

రాయదుర్గంరూరల్, జూలై 13: పట్టణంలోని పశువైద్యశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పశువైద్యుడు సూర్యనారాయణరెడ్డి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. గుమ్మఘట్ట పశువైద్యాధికారి డాక్టర్ నవీన్, అటవీ సిబ్బంది, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ మరమ్మతులను వేగవంతం చేయండి

గుంతకల్లుటౌన్,జూలై 13: జీబీసీ బ్రిడ్జి ప్రహరీ మరమ్మతుల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు అధికారులకు సూచించారు. స్థానిక ఆలూరు రోడ్డులో వర్షాలకు కూలిపోయిన జీబీసీ ప్రహరీని శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహదారిలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు తలారిమస్తానప్ప, హనమంతు తదితరులు పాల్గొన్నారు.

పయ్యావుల శ్రీనివాసులుకు సన్మానం

ఉరవకొండ,జూలై 13: ఉరవకొండ, వజ్రకరూరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు వన్నూరుస్వామి, చాబాల ఈశ్వర్, పురుషోత్తం, ఈడిగవేణు తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుడు పయ్యావుల శ్రీనివాసులును అనంతపురంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానం చేశారు.

నేడు చిన్న సరిగెత్తు



కూడేరులో కొలువుదీరిన పీర్లు

కూడేరు, జూలై 13: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో చిన్న సరిగెత్తు ఘనంగా జరగనుంది. ఇప్పటికే పీర్లమఖానంలో ముజావర్లు పీర్లను వెండిగొడుగులతో ప్రత్యేకంగా అలంకరించి కొలువుదీర్చారు. అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు. కూడేరు, కమ్మూరు, కొర్రకోడు, చోళసముద్రం తదితర గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి.

కంకర క్వారీ పరిశీలన



గ్రామస్థులతో చర్చిస్తున్న అడ్వకేట్ జనరల్ రిజ్వాన్ అలీ

విడపనకల్లు, జూలై 13: మండలంలోని కడదరబెంచి గ్రామంలో ఎస్ఆర్‌కే కంపెనీ నిర్వహిస్తున్న కంకర క్వారీపై హైకోర్టుకు చెందిన అడ్వకేట్ జనరల్ రిజ్వాన్ అలీ శనివారం విచారణ చేపట్టారు. కడదరబెంచి గ్రామానికి చెందిన మనోహర్‌తో పాటు మరి కొంత మంది గ్రామస్థులు కంకర క్వారీ వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు హైకోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించేందుకు హైకోర్టు అడ్వకేట్ జనరల్ రిజ్వాన్ అలీ కడదరబెంచి గ్రామం చేరుకుని క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. సరిహద్దులను సర్వే చేయించారు. గ్రామస్థులతో వివరాలడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. కంకర క్వారీ నంచి వచ్చే దుమ్మూధూళి వల్ల పంట పొలాలు నాశనమవుతున్నాయన్నారు. పంటలు ఏమాత్ర పండడం లేదని వాపోయారు. గ్రామంలోకి కూడా దుమ్ము వస్తోందని, దీంతో శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నామని చెప్పారు. రాత్రి సమయాల్లో క్వారీలో పెద్ద పెద్ద బ్లాస్టింగ్‌లు చేయటం వల్ల భయాందోళనకు గురవుతున్నామన్నారు. లీజుకు తీసుకున్న స్థలం కాకుండా మరింత స్థలాన్ని ఆక్రమించి బ్లాస్టింగ్ చేస్తున్నారని అన్నారు. స్థానికంగా పరిశీలించిన వివరాలను కోర్టుకు నివేదిస్తామని అడ్వకేట్ జనరల్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు దస్తగిరయ్య, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో భరత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణాకేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ



నిరుద్యోగులకు సూచనలిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

కళ్యాణదుర్గం, జూలై 13: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని ఆర్డీఓ రాణి సుస్మిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు పాఠాలు చెప్పారు. డీఎస్సీలో జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన టాపిక్‌పై క్షుణ్ణంగా వివరించారు. విజయాన్ని సాధించాలంటే ఏ విధంగా ప్రణాళిక వేసుకుని ముందుకు సాగాలో తెలిపారు. డీఎస్సీ ఉచిత శిక్షణను ఏర్పాటు చేసి ఎంతోమంది నిరుద్యోగులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదుకుంటున్నారని కొనియాడారు.

సచివాలయ కిటికీల ధ్వంసం



ధ్వంసమైన కిటికీల అద్దాలు

గుత్తి రూరల్, జూలై 13: మండలంలోని శ్రీపురం గ్రామశివారులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవన కిటికీల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ. 43.60 లక్షల వ్యయంతో ఈ సచివాలయ భవనాన్ని నిర్మించారు. కానీ ఇంతవరకు ప్రారంభించ లేదు. ఈ భవనానికి మొత్తం 12 కిటికీలు, 12 డిజైన్ వెంటిలేటర్లు ఉన్నాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు 9కిటికీలు, 10 డిజైన్ వెంటిలేటర్లకు ఉన్న అద్దాలను రాళ్లతో పగులకొట్టారు. రూ.లక్ష నష్టం వాటిలినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై గ్రామస్థులు, సర్పంచు లింగమయ్య, సచివాలయ సిబ్బంది గుత్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైభవంగా పల్లకీ సేవ



స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, జూలై 13: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరంస్వామి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి

తాడిపత్రి, జూలై 13: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ జనార్దన్‌నాయుడు సూచించారు. అప్‌గ్రేడ్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం పీర్లను ఏర్పాటుచేసే నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో మొహర్రం పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. చిన్నపాటి ఘర్షణ జరిగినా నిర్వాహకులే పూర్తిబాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐలు సాగర్, కాటమయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసంపై అవగాహన సదస్సు

బెళుగుప్ప, జూలై 13: పశుగ్రాసం వారోత్సవాలలో భాగంగా మండలకేంద్రంలో శనివారం పశువైద్య సంచాలకులు శ్రీనివాసగుప్తా పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడిపశువులకు పచ్చిమేత ఎంతో ప్రధానమందన్నారు. ముఖ్యంగా పాల ఉత్పత్తికి ఎంతో దోహదపడుతుందన్నారు. రెడ్ నేపియర్, సూపర్ నేపియర్, సుబాబుల్, అవిశ తదితర గడ్డి రకాలను పెంచుకుని పాడిసంపదను కాపాడుకోవాలని సూచించారు. పశువైద్యుడు రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల నమోదు

పుట్లూరు, జూలై13: మండలంలోని కడవకల్లు గ్రామంలో ఇంటివద్ద మురికినీటి విషయంలో మహిళలు ఘర్షణపడడంతో శనివారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన సరోజమ్మ, శైలజ గొడవపడి కొట్టుకున్నారు. దీంతో సరోజమ్మకు చెవివద్ద రక్తగాయం కావడంతో ఆసుపత్రికి తరలించామన్నారు. సరోజమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఇదే గ్రామానికి చెందిన హేమావతి ఫిర్యాదు మేరకు సిద్ధయ్యపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. రెండురోజుల క్రితం గ్రామంలోని సీఎస్ఐ చర్చి వద్ద హేమావతిని సిద్ధయ్య అతని భార్య అంజలి పాత గొడవలను మనసులో పెట్టుకొని కొట్టారన్నారు. హేమావతి ఫిర్యాదుమేరకు శనివారం కేసు నమోదుచేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ సొమ్ము రికవరీ

బెళుగుప్ప, జూలై 13 : మండలంలోని అంకంపల్లిలో మారెమ్మ ఆలయంలో గత ఏప్రిల్ 18వ తేదీ దొంగతనం చేసిన నిందితుడిని శనివారం గంగవరం బంకు వద్ద అరెస్టు చేశామని, అతడి వద్ద నుంచి రెండు ఇత్తడి గంటలను, హుండీలోని రూ.15 వేల నగదును రికవరీ చేశామని ఎస్ఐ శివ తెలిపారు. దొంగను కళ్యాణదుర్గంలోని గుండ్లప్ప దొడ్డికి చెందిన ఓబన్నగా గుర్తించామన్నారు. రికవరీ చేసిన సొమ్మును గ్రామస్థులకు స్వాధీనం చేశామని చెప్పారు

పారిశుధ్య పనులు

కణేకల్లు, జూలై 13: మండలంలోని గోపులాపురం గ్రామంలో టీడీపీ నాయకులు సొంత నిధులతో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఏడాది నుంచి గ్రామంలో ఎలాంటి పారిశుధ్య పనులు చేయలేదు. దీంతో పలు వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. ఇందుకు స్థానిక టీడీపీ నాయకులు ఆదినారాయణ, బసవరాజు, బాయినేని నవీన్ సొంతనిధులు వెచ్చించి కార్మికుల చేత గత మూడురోజులుగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు.

16న సర్వసభ్య సమావేశం

పుట్లూరు, జూలై 13: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 16న సర్వసభ్య సమావేశం జరగనుందని తహశీల్దార్ మల్లికార్జునస్వామి శనివారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరుకానున్నారన్నారు. కనుక అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక రావాలని సూచించారు.